ప్రజాశక్తి
ఆదివారం 2 ఫిబ్రవరి 2025 5
శ్రీ సత్యసాయి

కందుల కొనుగోలును ప్రారంభిస్తున్న మంత్రి సవిత

కందులు కొనుగోలు చేసిన వారం రోజుల్లోనే..

పద్దు పొడవలేదు..!

- కేంద్రీయ విశ్వవిద్యాలయానికి నిధులు నిల్
- వెనుకబడిన ప్రాంతాలకు ఒట్టి చెయ్యి..
- బడ్జెట్‌పై జనం పెదవివిరుపు

కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన 2025-26 ఆర్థిక బడ్జెట్ నిరాశపరచింది. ఉపాధి, నిరుద్యోగం, పన్నుల భారం తదితర అంశాలపై పెద్దఎత్తున సామాన్యులు ఆశలు పెట్టుకున్నారు. ఇందులో కొన్ని అంశాలను ప్రస్తావించినప్పటికీ నిర్దిష్టమైన ఉపశమనాలేవీ కనిపించలేదని విపక్షాలు విమర్శిస్తున్నాయి. ఈ బడ్జెట్‌లో వెనుకబడిన ఉమ్మడి అనంతపురం జిల్లాకు ప్రత్యేకమైన కేటాయింపుల్లేవు. గుంతకల్లు రైల్వే డివిజన్‌కు అరకొరగానే కేటాయింపులు జరిగినట్టు తెలుస్తోంది. కేంద్రీయ విశ్వవిద్యాలయానికి గతంలాగానే చిల్లర విధింపులే జరిగాయి. ఉమ్మడి జిల్లాకు నిధుల కేటాయింపు విషయంలో కేంద్రం మరోసారి పూర్తిగా సీతకన్ను వేసిందని పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అనంతపురం జిల్లాలో ఏర్పాటైె కేంద్రీయ విశ్వవిద్యాలయానికి నిధుల కేటాయింపులు లేవనే చెప్పవచ్చు. అంతకు మునుపు ఏడాది కేటాయించిన రూ.112 కోట్లే తప్పా ఈసారి బడ్జెట్‌లో ప్రత్యేకమైన కేటాయింపులేవీ కనబరచలేదు. ముందు కేటాయించిన నిధులతో సొంత భవన నిర్మాణాలు సాగుతున్నాయి. ఇప్పుడు జరుగుతున్న నిర్మాణాల వరకే పరిమితమయ్యే అవకశాలు కనిపిస్తున్నాయి. కొత్త బడ్జెట్‌లో ఒక్క రూపాయి నిధులనూ కేంద్ర ప్రభుత్వం కేటాయించకపోవడం గమనార్హం.

ఉపాధి హామీకి తగ్గిన కేటాయింపులు

అనంతపురం జిల్లా గ్రామీణ ప్రాంతానికి ఎంతో కీలకమైన ఉపాధి హామీ పథకానికి కేంద్ర ప్రభుత్వం నిధుల కేటాయింపులు తగ్గించేసింది. అంతకు మునుపు ఏడాది బడ్జెట్‌లో రూ.89 వేల కోట్లు కేటాయిస్తే గత బడ్జెట్‌లో రూ.86 వేల కోట్లు కేటాయించింది. ఈసారి అదే మొత్తం కేటాయించింది. గ్రామీణాభివృద్ధికి ప్రాధాన్యమిస్తున్నామని బడ్జెట్‌లో నిర్మల సీతారామన్ చెప్పినప్పటికీ కేటాయింపుల్లో పెరుగుదల కనిపించలేదు

ఏపీకి అన్యాయం

కేంద్రం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం జరిగింది. వ్యవసాయ రంగానికి ఊతమిచ్చేలా ఎలాంటి ప్రకటన చేయకపోవడం బాధాకరం. ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడడానికి ఏపీ, బీహార్ ఎంపీలే కీలకం. ఇలాంటి తరుణంలో బీహార్‌కు ఒకలా.. ఆంధ్రప్రదేశ్‌కు ఒకలా బడ్జెట్ కేటాయింపులు ఉండడం విచారకరం. ఏపీకి కొత్త ప్రాజెక్టులు సాధించుకోవడంలో సీఎం చంద్రబాబు వైఫల్యం చెందారు. ఎన్డీయే భాగస్వాములుగా చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు సాధించింది ఏమిటో ఆత్మపరిశీలన చేసుకోవాలి.

అనంత వెంకటరామిరెడ్డి, వైసిపి అనంతపురం జిల్లా అధ్యక్షుడు.

రాష్ట్రానికి తీరని అన్యాయం

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తీరని అన్యాయం చేసింది. ఇక్కడి ఎంపిల మద్దతుతో అధికారంలోనున్న కేంద్ర ప్రభుత్వం ఈ రాష్ట్రానికి నిధుల కేటాయింపుల్లో మాత్రం తగినంత ప్రాధాన్యతనివ్వలేదు. బడ్జెట్‌లో కనీసం ఈ రాష్ట్రం పేరు కూడా ప్రస్తావించకపోవడం శోచనీయం. అదే బీహార్ మద్దతుతోనున్న చోట మాత్రం కేటాయింపులు జరిపింది. పోలవరం, ప్రత్యేక హోదా అంశాల ప్రస్తావ లేదు. ఇంత అన్యాయం జరుగుతున్నా మద్దతునిస్తున్న కూటమిలోని తెలుగుదేశం, జనసేన పార్టీలు కనీస పెదవి విప్పడం లేదు. దీనిపై ఆ రెండు పార్టీలు ఖచ్చితంగా స్పందించాల్సిన అవసరముంది. వ్యవసాయాన్ని దివాలా తీసే విధంగా ఈ బడ్జెట్ ఉంది. విద్యుత్ సంస్కరణల పేరుతో ప్రయివేటుకు అప్పగించే కార్యక్రమాలు రాష్ట్రంలోనూ కొనసాగుతున్నాయి. ఈ బడ్జెట్ రాష్ట్రానికి తీరని అన్యాయం చేసింది.

వి.రాంభూపాల్, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు.

నిరాశపరచిన బడ్జెట్

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ నిరాశాజనకమైంది. రాష్ట్రం నుంచి 25 మంది ఎంపిల మద్దతునిస్తున్నా ఈ రాష్ట్రానికి తగిన ప్రాధాన్యతను బడ్జెట్‌లో కల్పించలేదు. ప్రత్యేక హోదాను విస్మరించింది. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే అంశాలేవి ఈ బడ్జెట్‌లో లేవు. మొత్తంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ బడ్జెట్ పూర్తి నిరాశాజనకమైంది.

ఎన్.రఘువీరారెడ్డి, ఎఐసిసి నాయకులు

విభజన హామీల ఊసే లేదు..

కేంద్ర బడ్జెట్లో ఏపీ విభజన హామీల ప్రస్తావనే లేదు. ఏపీకి ప్రత్యేక హోదా, వెనుకబడిన జిల్లాల ప్యాకేజీకి సంబంధించి ఎలాంటి ప్రకటనా చేయలేదు. కూటమి ప్రభుత్వం ఎంపిల మద్దతుతో కేంద్రం పాలన సాగిస్తోంది. అయినా రాష్ట్రానికి నిధులు రాబట్టడంలో కూటమి ప్రభుత్వం, ఎంపీలు పూర్తిగా విఫలం అయ్యారు. బడ్జెట్‌లో కేటాయింపులు లేకున్నా రాష్ట్ర ఎంపీలు ప్రశ్నించకపోవడం దారుణం. వ్యవసాయాన్ని పూర్తిగా కార్పొరేట్లకు కట్టబెట్టే విధంగా బడ్జెట్ ఉంది. కార్మికుల సంక్షేమాన్నీ విస్మరించారు.

ఇఎస్.వెంకటేష్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి.

రైతుల ఖాతాల్లో నగదు వేస్తాం

రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత

ప్రజాశక్తి-రొద్దం

ప్రభుత్వం మద్దతుధరతో కొనుగోలు చేస్తున్న కందులకు సంబంధించి వారం రోజుల్లో సంబంధిత రైతుల ఖాతాల్లోకి నగదు జమ చేస్తామని రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత తెలిపారు. శనివారం మండల పరిధిలోని చోలేమర్రి గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను మంత్రి సవిత ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం సచివాలయం ముందు నిర్వహించిన సభనుద్దేశించి ఆమె మాట్లాడారు. పింఛన్లను రూ.4వేలకు పెంచి 1వ తేదీనే లబ్ధిదారుల ఇళ్ల వద్దకెళ్లి పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని తెలిపారు. అభివృద్ధి పనులకు సంబంధించి మండలంలో దాదాపు రూ.6 కోట్లతో సీసీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణం చేపట్టామన్నారు. మండలంలో 20 గోకులం షెడ్లు నిర్మిస్తున్నామని వెల్లడించారు. త్వరలో మరిన్ని గోకులాలు నిర్మించబోతున్నామన్నారు. ఒక్కో మండలానికి ఒక్కో డ్రోన్ కేటాయింపు చేపట్టామన్నారు. సచివాలయాల ద్వారా కందులు కొనుగోలు చేపట్టామన్నారు. క్వింటాళ్లకు రూ.7,550 ఇస్తున్నట్లు చెప్పారు. కందులు కొనుగోలు చేసిన వారం రోజుల్లో నేరుగా రైతుల ఖాతాల్లోనే నగదు జమచేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి స్వయంప్రభ, ఏవో నివేదిత, ఎంపీడీవో రామ్ కుమార్, ఈఓఆర్‌డి గోవిందప్ప, టిడిపి నాయకులు మాధవ నాయుడు, కన్వీనర్ నరహరి, వెంకటరామిరెడ్డి, చిన్నప్పయ్య, టైలర్ ఆంజనేయులు, నరసింహులు, చోలే మర్రి సర్పంచి జనార్ధన్, కంబాలపల్లి సర్పంచి మంచు, శ్రీనాథ్ చౌదరి, రాగి మేకలపల్లి బాషా, కందులు కొనుగోలు ఏజెన్సీ రామకృష్ణ, వెంకటేష్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యా రంగాన్ని పరిరక్షించాలి

పిడిఎఫ్ ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు

యుటిఎఫ్ నాయకులతో ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి -పెనుకొండ టౌన్

ప్రభుత్వ విద్యా రంగాన్ని సరిదిద్దాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని పిడిఎఫ్ ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. శనివారం పెనుకొండ పట్టణంలోని మౌర్య రెసిడెన్సీలో యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుధాకర్ ఆధ్వర్యంలో పెనుకొండ డివిజన్ కార్యవర్గ సమావేశంలో ఎమ్మెల్సీ వెంకటేశ్వర రావు ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. గత ప్రభుత్వం అమలు పరిచిన 117 జీవో ఫలితంగా విద్యారంగం అస్తవ్యస్తంగా, గందరగోళంగా మారిందన్నారు. కూటమి ప్రభుత్వం విద్యా రంగాన్ని వెంటనే సరిదిద్దాలని డిమాండ్ చేశారు. ఈ ప్రభుత్వం కూడా ఉపాధ్యాయులను బోధనకు పరిమితం చేయకుండా, బోధనా సమయాన్ని యాప్ ల పనిభారంతో, ఆన్లైన్‌వర్క్‌తో వథా చేస్తున్నారన్నారు. 3,4,5, ప్రాథమిక పాఠశాలలో కొనసాగాలని అందుకోసం రెండు రకాల పాఠశాలలను 1 నుంచి 5, 6 నుంచి 10 వరకూ ఉండేలా కొనసాగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ విద్యారంగా పరిరక్షణ కోసం యూటీఎఫ్ ఎంతో పోరాటం చేసిందని, ప్రభుత్వ బడులను కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని తెలిపారు. ప్రభుత్వం ఏర్పడి దాదాపు 7 నెలలు కావస్తున్నా ఉద్యోగ ఉపాధ్యాయులకు ఆర్థిక పరమైన విషయంలో ఎటువంటి పురోగతి లేదన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు దాదాపు 25 వేల కోట్ల బకాయిలు చెల్లించాల్సింది ఉందని తెలిపారు. సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ గౌరవాధ్యక్షులు భూతన్న, జిల్లా కార్యదర్శి ఈ.నారాయణ స్వామి, జిల్లా మహిళా కమిటీ కన్వీనర్ హసీనా బేగం, కష్ణ నాయక్, జి.రమేష్, రవీంద్రనాథ్, ఎంకె.నబీ, ఉపేంద్ర, మారుతీ, నరసింహుడు, రామాంజినేయులు, వెంకటా నాయక్, సునీత, నాగమణి, రాధా మణి తదితరులు పాల్గొన్నారు.

విద్య, వైద్యంకు ప్రాధాన్యమివ్వాలి : కేతిరెడ్డి

కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

ప్రభుత్వాలు విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి తెలిపారు. పట్టణంలోని తన నివాసంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎన్ని ప్రభుత్వాలు వచ్చినా విద్య, వైద్యం రంగాలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చిన ఘనత జగన్ నేతృత్వంలోనే వైసిపి ప్రభుత్వానికే దక్కుతుందని తెలిపారు. 2014-19లో చంద్రబాబు పెట్టిన పాత బకాయిలను వైసిపి ప్రభుత్వం చెల్లించిందన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను చిత్తశుద్ధితో అమలు చేశామన్నారు. పేద ప్రజల కష్టాన్ని గుర్తించింది ఒక్క వైసిపి ప్రభుత్వమే అన్నారు. పేద పిల్లలకు ఉన్నత విద్యను అందించాలన్నదే వైసిపి లక్ష్యమన్నారు. ఈ క్రమంలో ఈ నెల 5వ తేదీ వైసిపి ఆధ్వర్యంలో చేపట్టనున్న 'ఫీజు పోరు' కార్యక్రమంలో వైసిపి శ్రేణులు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

సర్వేయర్, విఆర్‌ఒపై కేసు

ఇళ్లల్లో పోలీసుల సోదాలు

విచారణ చేస్తున్న పోలీసులు

ప్రజాశక్తి హిందూపురం

నకిలీ పట్టాల వ్యవహారంలో గతంలో హిందూపురం తహశీల్దార్ కార్యాలయంలో విధులు నిర్వహించిన సర్వేయర్ శ్రీనివాసులు, విఆర్‌ఒ రామ్మోహన్‌లపై హిందూపురం అప్డేట్ స్టేషన్‌లో కేసు నమోదు అయ్యింది. హిందూపురం రూరల్ మండలం మణే సముద్రం వద్ద రిటైర్డ్ సబ్ రిజిస్టర్ గోపాల కృష్ణకు చెందిన భూమికి నకలీ పట్టాలను సష్టించి, ఇతరులకు విక్రయించారు. మరో ఐదు మంది రైతులు తమ భూములకు నకిలీ పత్రాలు సృష్టించారని సర్వేయర్, విఆర్‌ఒలపై వారు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు అయ్యింది. శనివారం సర్వేయర్ తో పాటు వీఆర్వోలను పోలీసులు అదుపులోకి తీసుకుని సమగ్ర విచారణ చేపట్టారు. సర్వేయర్ ఇంటితో పాటు మరి కొంతమంది ఇళ్లల్లో పోలీసులు సోదాలు నిర్వహించినట్లు తెలుస్తుంది. బాధితులు చేసిన ఫిర్యాదుపై డీఎస్పీ మహేష్ ఆధ్వర్యంలో సిఐ ఆంజనేయులు కేసుకు సంబంధించి విచారణ చేపట్టారు.

సిపిఎం రాష్ట్ర మహాసభల్లో జిల్లా ప్రతినిధులు

సిపిఎం 27వ రాష్ట్ర మహాసభలు నెల్లూరు నగరంలో శనివారం ప్రారంభం అయ్యాయి. నెల్లూరు నగరంలోని మాగుంట లేఅవుట్ అనిల్ గార్డెన్‌లో ప్రతినిధుల సభతో మహాసభలు మొదలయ్యాయి. ఈ మహాసభలకు శ్రీ సత్యసాయి జిల్లా ప్రతినిధుల బృందం హాజరైంది. జిల్లాకు సంబంధించి నిర్వహించిన చర్చల్లో పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభల్లో అనంతపురం జిల్లా ప్రతినిధులు

విద్యార్థులతో మంత్రి సవిత

కార్పొరేట్‌కు దీటుగా ఎంజెపి స్కూళ్లలో విద్యాబోధన

రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత

ప్రజాశక్తి-పెనుకొండ

కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా ఎంజేపీ స్కూళ్లలో విద్యా బోధన సాగుతోందని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. పట్టణంలోని రొద్దం-2 ఎంజేపీ బాలుర సంక్షేమ పాఠశాలను రూ.56 లక్షలతో పునర్ నిర్మాణం పనుల పూర్తికావడంతో మంత్రి శనివారం ప్రారంభించారు. మరుగుదొడ్లు, వంటగది, విద్యార్థుల విశ్రాంతి గదులను పరిశీలించి సంతప్తి వ్యక్తం చేశారు. అనంతరం నిర్వహించిన సభలో మంత్రి మాట్లాడుతూ రొద్దం-2 ఎంజేపీ స్కూల్ అభివృద్ధికి తాను రూ.11 లక్షలు ఇవ్వగా, మిగిలిన మొత్తం అంతా దాతలు విరాళాలు రూపంలో అందజేశారన్నారు. కార్పొరేట్‌కు దీటుగా బీసీ బిడ్డలు చదువుకోవాలన్నది సీఎం చంద్రబాబు నాయుడు లక్ష్యమన్నారు. ఎంజెపి స్కూళ్లకు సంబంధించి డైట్ బిల్లు, కాస్మోటిక్ ఛార్జీల బకాయిలు చెల్లించారన్నారు. ఒక్క అవకాశమంటూ అధికారంలోకి వచ్చిన జగన్ బీసీ బిడ్డలు చదువుకోకూడదన్న దుర్బుద్ధితో ఎంజేపీ స్కూళ్ల నిర్మాణాలను పక్కనపడేశారని మండిపడ్డారు. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎంజేపీ స్కూళ్ల ద్వారా ఆరోగ్య భద్రత, ఆహార భద్రతతో కూడిన విద్యను అందిస్తున్నామన్నారు. ఎంజేపీ స్కూళ్లలో ఇన్వర్టర్లు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. విద్యార్థులు బాగా చదివి పదిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని మంత్రి ఆకాంక్షించారు.

మంత్రి సవితపై ప్రశంసల వెల్లువ

గత ఏడాది జూలై లో రొద్దం-2 ఎంజేపీ స్కూల్‌ను మంత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడున్న పరిస్థితులు, విద్యార్థుల ఇక్కట్లను చూసి ఆమె చలించిపోయారు. తాను సొంతంగా రూ.11 లక్షలు ఇవ్వగా, మిగిలిన మొత్తం దాతల సాయంతో సేకరించి రూ.56 లక్షలతో 6 నెలల్లో హాస్టల్ రూపురేఖలు మార్చారు. నూతన హాస్టల్ భవనం, వసతి సదుపాయాలను చూసిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, బోధన, బోధనేతర సిబ్బంది, స్థానికులు ఆనందం వ్యక్తంచేస్తూ మంత్రి సవితపై ప్రశంసలు కురిపించారు.

విద్యార్థులు పోటీతత్వంతో ముందుకెళ్లాలి

ఎన్ఎస్‌పిఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఓపెన్ డే

ప్రజాశక్తి-హిందూపురం

విద్యార్థులు పోటీతత్వంతో ముందుకు నడిచి అత్యుత్తమ ఫలితాలు సాధించాలని కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ వెంకటేశులు పేర్కొన్నారు. శనివారం కళాశాలలో అమలవుతున్న సౌకర్యాలు, అందిస్తున్న విద్య తదితర అంశాలపై వివిధ జూనియర్ కళాశాలల విద్యార్థులకు ఓపెన్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. డిగ్రీలో ప్రవేశపెట్టిన సింగిల్ మేజర్ సబ్జెక్టుపై అవగాహన, కళాశాలలోని సదుపాయాలు, వసతులను ప్రత్యక్షంగా ఇంటర్ విద్యార్థులు వీక్షించడానికి ఉన్నత విద్యా విభాగం కమిషనరేట్ ఆదేశాల మేరకు కళాశాలలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆయన తెలిపారు. డిగ్రీలో చేరబోయే ద్వితీయ సంవత్సర ఇంటర్ విద్యార్థులు కళాశాలలోని ల్యాబ్‌లు, గ్రంథాలయం, క్రీడల విభాగం, లాంగ్వేజ్ ల్యాబ్, జెకెసి సెల్, ఎన్‌సిసి, ఎన్ఎస్ఎస్ విభాగాల తో పాటు అన్ని విభాగాలను సందర్శించే ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పట్టణ పరిధిలోని సువర్ణ భారతి జూనియర్ కళాశాల, చిలమత్తూరు లేపాక్షి జూనియర్ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు. ప్రయివేటు, కార్పొరేట్ కళాశాలకు ఏమాత్రం తీసిపోని విధంగా అత్యాధునిక వసతులతో కళాశాల విద్యార్థులకు నాణ్యమైన విద్యనందిస్తున్న అధ్యాపకులకు జూనియర్ కళాశాల విద్యార్థులు అధ్యాపకులు అభినందనలు తెలిపారు. జూనియర్ కళాశాల విద్యార్థులకు క్విజ్, సాంస్కతిక కార్యక్రమాల్లో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. విద్యార్థులకు కళాశాలలో భోజన వసతి ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సువర్ణ భారతి కళాశాల అధ్యాపకులు రాఘవేంద్ర, చిలమత్తూరు జూనియర్ కళాశాల అధ్యాపకులు నాగజ్యోతి మెహర్ తాజ్, డిగ్రీ కళాశాల ఐక్యు ఏసీ కోఆర్డినేటర్ శ్రీలక్ష్మి, అధ్యాపకులు ఎల్ఆర్ రమేష్, రవి నాయక్, పార్వతి, సుమంగళి, ప్రకాష్ రావ్, కళాశాల సీనియర్ అసిస్టెంట్ బి.నరసింహులు, ఎన్‌సిసి ఆఫీసర్ సరస్వతి, ఎన్ఎస్-ఎస్ పిఒ రంగనాయకులు పాల్గొన్నారు.

కళాశాలలో వసతుల చిత్రాలను పరిశీలన చేస్తున్న విద్యార్థులు

ఊట నీటికి తాత్కాలిక పరిష్కారం

ప్రజాశక్తి-బుక్కపట్నం

పంట పొలాలకు వెళ్లే ప్రధాన కాలువల ద్వారా వచ్చే ఊట నీరు ప్రవహిస్తూ స్థానిక బిసి హాస్టల్‌కు వెళ్లే రహదారిపై నిత్యం నీరు చేరుతోంది. దీంతో ప్రజలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఈ పరిస్థితుల్లో స్పందించిన డిపిఒ సమిత శనివారం ఊట నీరు ప్రవహిస్తున్న పలు కాలనీలను సందర్శించి తాత్కాలిక పరిష్కారం చూపారు. కాలువల ద్వారా నీటి ప్రవాహం తగ్గిన వెంటనే శాశ్వత పరిష్కారం చూపుతామని తెలిపారు. సాగునీటి కాలువలను ఆక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. మురుగునీరు రోడ్డుపైకి వదిలే వారికి నోటీసులు ఇవ్వాలని పంచాయతీ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో సర్పంచి నాగలక్ష్మిరాజు, ఇరిగేషన్ డీఈ సుధాకర్, తహశీల్దార్ షాబుద్దీన్, ఎంపీడీవో శ్రీనివాసులు, ఇరిగేషన్ జేఈ జమునాబాయి, ఈవోఆర్‌డీ అశోక్‌కుమార్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సాధిక్‌బాషా, సాగునీటి సంఘం ఉపాధ్యక్షుడు సంజీవరాయుడు, నాయకులు చిన్నకృష్ణ, ఫొటో స్టూడియో నజీర్, కాలనీవాసులు పాల్గొన్నారు.

కందుల కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి మడకశిర

మండలంలోని ఆర్.అనంతపురంలో ఏర్పాటు చేసిన కందుల కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ప్రారంభించారు. రైతులు పండించిన కందులను మద్దతు ధరతో కొనుగోలు చేసేందుకు అవసరమైన ఏర్పాట్లపై ఎమ్మెల్యే ఆరా తీశారు. ఈ కేంద్రం రైతులకు ఉపయోగపడేలా పని చేయాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. అనంతరం నూతనంగా నిర్మించిన ఎఫ్‌సిఐ గోడౌన్‌ను వారు ప్రారంభించారు. అనంతరం గోడౌన్‌ను పరిశీలించారు. అనంతరం వారు మండలంలోని ఆర్.అనంతపురం, ఛత్రం పంచాయతీ, సి.రంగాపురం, అయ్యవారిపల్లి గ్రామాల్లో చేపట్టిన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రి తనిఖీ

పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి నూతన భవన నిర్మాణ పనులను ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి పరిశీలించారు. త్వరితగతిన భవన నిర్మాణం పూర్తి చేయాలని ఆదేశించారు. రోగులకు మెరుగైన వైద్య సదుపాయాలు అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. వారి వెంట టిడిపి మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి రంగేగౌడ్, నాయకులు నాగరాజు, నంజుండ, నరేష్ కన్నా, జయపాల్ ఉన్నారు.

నారాయణ కళాశాలపై క్రిమినల్ కేసు నమోదు చేయాలి

ప్రజాశక్తి-హిందూపురం

వేధింపులతో విద్యార్థి ఆత్మహత్యకు కారణమైన అనంతపురం నారాయణ జూనియర్ కళాశాలపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని మాదిగ స్టూడెంట్స్ ఫెడరేషన్ (ఎంఎస్ఎఫ్) నాయకులు డిమాండ్ చేశారు. నారాయణ కళాశాలపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతూ శనివారం స్థానిక అంబేద్కర్ సర్కిల్‌లో కళ్ళకు గంతలు కట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మధు, లోకేష్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్లు ప్రవేశపెట్టింది టిడిపినే : మంత్రి

ప్రజాశక్తి-పెనుకొండ

పింఛను మొదలుపెట్టింది ఎన్టీఆర్ అయితే దానిని రూ. 4వేలకు పెంచింది సిఎం చంద్రబాబు అని మంత్రి సవిత తెలిపారు. మంత్రి శనివారం మండలంలోని వెంకటాపురంతండాలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణి కార్యక్రమంలో పాల్గొన్నారు. పలువురు మహిళలు, వృద్ధులు, వికలాంగులకు పింఛను నగదు అందజేసి వారితో ముచ్చటించారు. మంత్రి మాట్లాడుతూ త్వరలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తామన్నారు. త్వరలోనే తల్లికి వందనం, రైతుభరోసా పథకాలు అమలుచేస్తామన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా సీసీ రోడ్లు, డ్రెయినేజీ, తదితర అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామ న్నారు. పెనుకొండ పట్టణంలో సుందరీకరణ పనులు, ఫోకస్ లైట్లతో పాటు రూ. 4 కోట్లతో అభివృద్ధి పనులు చేపడతామని తెలిపారు. వైసిపి ప్రజల్లో విశ్వాసం కోల్పోయిందని, ఉనికి కోసమే ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో నగర పంచాయతీ కమిషనర్ సతీష్‌కుమార్, తహశీల్దార్ శ్రీధర్, టిడిపి పట్టణ కన్వీనర్ శ్రీరాములుయాదవ్, త్రివేంద్రనాయుడు, సిసి హరి, రమణమ్మ పాల్గొన్నారు.


వృద్ధుడికి పింఛను అందజేస్తున్న మంత్రి

లేపాక్షిలో మహాశివరాత్రి ఉత్సవాలపై సమావేశం

ప్రజాశక్తి-లేపాక్షి

స్థానిక దుర్గా వీరభద్రస్వామి ఆలయంలో ఈ నెల 25 నుంచి మార్చి 1వ తేదీ వరకు నిర్వహించే మహాశివరాత్రి ఉత్సవాలపై శనివారం ఆలయ ప్రాంగణంలో ఆలయ కమిటీ ఛైర్మన్ కరణం రమానం దం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఛైర్మన్ మాట్లాడుతూ ఉత్సవాలకు హాజరయ్యే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లు చేస్తామన్నారు. ప్రతిరోజూ అన్నదానం, ప్రసాదాలు పంపిణీ చేస్తామన్నారు. కానుకలు హుండీలో వేసేలా అక్కడక్కడ స్కానర్లు ఏర్పాటు చేశామన్నారు. దాతలు దేవాదాయ శాఖ వారిని సంప్రదించి విరాళాలు ఇచ్చి రశీదు పొందాలన్నారు. భక్తులు సంప్ర దాయ దుస్తుల్లో దేవున్ని దర్శించుకోవాలన్నారు. సమావేశంలో ఆలయ కార్య నిర్వహణ అధికారి నరసింహమూర్తి, గోపి, శంకరప్ప, రామకృష్ణ, దేవాదాయ సిబ్బంది, కమిటీ సభ్యులు, అర్చకులు శీనస్వామి, సింహస్వామి పాల్గొన్నారు.

సమావేశమైన ఆలయ కమిటీ సభ్యులు

ముస్లిం ఐక్యవేదిక జిల్లా గౌరవ సలహాదారుగా గౌస్

ప్రజాశక్తి-ఓబుళదేవరచెరువు

ముస్లిం ఐక్యవేదిక జిల్లా గౌరవ సలహాదారుగా తనను నియమించినట్లు శనివారం గౌస్‌లాజమ్ తెలిపారు. గౌస్ మాట్లాడుతూ ముస్లింల సమస్యల పరిష్కారం కోసం పని చేస్తానని తెలిపారు. ఉర్దూ పాఠశాలలను తెలుగు మీడియం పాఠశాలలో విలీనం చేయకూడదని, ఉర్దూను రెండో అధికార భాషగా ప్రకటించాలని, రాష్ట్రంలో ఉర్దూ నేషనల్ యూనివర్సిటీ స్థాపించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

ముఖ్య అతిథులను సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

ఘనంగా 'బ్లూమూన్' వార్షికోత్సవం

ప్రజాశక్తి-కదిరి టౌన్

విద్యార్థులు ప్రణాళిక ప్రకారం చదివితే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని ఆర్డీవో వివిఎస్ శర్మ, బ్లూమూన్ ఇనిస్టిట్యూట్ అధినేత మంచి శివశంకర్ పేర్కొన్నారు. కదిరి పట్టణ శివారులో ఉన్న బ్లూమూన్ ఇంటర్నేషనల్ పాఠశాలలో శనివారం 15వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా విద్యాసంస్థల అధినేత ఎం.శివశంకర్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా కదిరి ఆర్డీవో వివిఎస్ శర్మ, ఆర్టీవో శ్రీనివాసులు, సిఐ నిరంజన్‌రెడ్డి, డాక్టర్ మదన్‌కుమార్ హాజరై విద్యార్థులకు విలువైన సలహాలు, సూచనలు అందించారు. విద్యార్థులు ఆటపాటలతో అలరించారు. అనంతరం అతిథులు విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ముఖ్య అతిథులను విద్యాసంస్థల అధినేత శివశంకర్, సెక్రటరీ శ్రీదేవి సత్కరించారు. కార్యక్రమంలో బ్లూమూన్ విద్యాసంస్థల సిబ్బంది, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బీమా రంగంలో 100 శాతం ఎఫ్‌డిఐ నష్టదాయకం

ప్రజాశక్తి-కదిరిటౌన్

బీమా రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల పరిమితిని 74 నుంచి 100 శాతానికి పెంచడం బీమా రంగం, పాలసీదారులకు నష్టదాయకమని అఖిల భారత బీమా ఉద్యోగుల సంఘం ఉమ్మడి అనంతపురం జిల్లా కార్యదర్శి ఎస్.శ్రీనివాసులు పేర్కొన్నారు. 100 శాతం ఎఫ్‌డిఐ అంటే స్వదేశీ కంపెనీ భాగస్వామి లేకుండానే ఓ విదేశీ ఇన్సూరెన్స్ కంపెనీ భారత దేశంలో నేరుగా ఏర్పాటు కావడ మని, ఇదే జరిగితే దేశంలో 1956కు ముందు పాలసీదారులను ముంచేసిన మోసాలు పునరావృతమ వుతాయన్నారు. ఈ నిర్ణయం దేశాభివృద్ధికి నిధులు అందిస్తున్న ఎల్ఐసిని పరోక్షంగా దెబ్బతీస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ బడ్జెట్ సమావేశాల్లో బీమా రంగంలో ఎఫ్‌డిఐ పెంచుతూ బీమా చట్ట సవరణ బిల్లును తీసుకొచ్చే అవకాశం ఉందని, అదే జరిగితే సమ్మెకు కూడా వెనకాడమని స్పష్టం చేశారు.

మాట్లాడుతున్న అఖిల భారత బీమా ఉద్యోగుల సంఘం నాయకులు

పొలాల్లో జింక మృతి

పరిగి : మండలంలోని తిరుమదేవరాయపల్లి సమీప పొలాల్లో జాతీయ రహదారి పక్కన శనివారం స్థానికులు ఓ జింక మృతి చెంది ఉండటాన్ని గుర్తించారు. జింక కళేబరాన్ని కుక్కలు తింటుండగా అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. జింక ఆహారం కోసం వచ్చి ఏదైనా ప్రమాదానికి గురై మృతి చెంది ఉండవచ్చని స్థానికులు భావిస్తున్నారు.

మృతి చెందిన జింక

జాతీయ సమైక్యత శిబిరానికి హర్షవర్ధన్

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

పట్టణంలోని కెహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి బి.హర్షవర్ధన్ జాతీయ సమైక్యత శిబిరానికి ఎంపికైనట్లు ప్రిన్సిపల్ డా. కె. ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ బీ.కాం థర్డ్ ఇయర్ విద్యార్థి బి.హర్షవర్ధన్ ఈ నెల 2 నుంచి 9వ తేదీ వరకూ పశ్చిమ గోదావరి జిల్లాలోని నర్సాపూర్‌లో జరిగే జాతీయ సమైక్యత శిబిరంలో పాల్గొంటాడని తెలిపారు. ఆ శిబిరంలో దేశ సంస్కృతి, ఆచార, సంప్రదాయాలు, సాంస్కృతిక ప్రదర్శనలు, సామాజిక, దేశ సేవ, దేశాభివృద్ధి, తదితర అంశాలను నేర్పిస్తారన్నారు. హర్షవర్ధన్‌కు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డా. బి.గోపాల్‌నాయక్, అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు అభినందన తెలిపారు.

హర్షవర్ధన్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపల్, అధ్యాపకులు

ఉద్యోగ విరమణ పోలీసులకు ఎస్పీ సన్మానం

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

ఉద్యోగ విరమణ పొందిన పోలీస్ ఉద్యోగులను శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో ఘనంగా సత్కరించారు. ధర్మవరం ఎఎస్ఐ అజుతుల్లా, రామగిరి హెడ్ కానిస్టేబుల్ రామాంజనేయులు, పుట్టపర్తి ఏఆర్ ఎస్ఐ రామలింగారెడ్డి, ఏఆర్ ఎస్ఐ రంగయ్య ఉద్యోగ విరమణ పొందగా ఎస్పీ పూలమాలలు, శాలువాలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఎస్పీ మాట్లాడుతూ వీరు జిల్లా పోలీస్ శాఖలో సుదీర్ఘ కాలం అంకితభావంతో సేవలు అందించారని కొనియాడారు. కార్యక్రమంలో ఎస్‌బి సిఐ బాలసుబ్రమణ్యంరెడ్డి, ఆర్ఐలు వలి, మహేష్, ఎస్‌బి ఎస్ఐ ప్రదీప్‌కుమార్, ఆర్ఎస్ఐ వీరన్న, రాష్ట్ర పోలీస్ అధికారుల సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు సూర్యకుమార్, జిల్లా కమిటీ సభ్యులు ఈశ్వరయ్య, పోలీస్ సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

హోంగార్డు కుమారునికి కారుణ్య నియామకం

హోంగార్డు ఆంజనేయులు బత్తలపల్లిలో విధులు నిర్వహిస్తూ గుండెపోటుతో మృతిచెందిన విషయం తెలిసిందే. ఆయన కుమారుడు ప్రసన్నకుమార్‌కు శనివారం ఎస్పీ వి.రత్న తన ఛాంబర్‌లో కారుణ్య నియామకం కింద హోంగార్డు నియామక పత్రం అందజేశారు. నిబద్ధతతో విధులు నిర్వర్తించాలని సూచించారు. కార్యక్రమంలో ఎఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, ఆర్ఐలు మహేష్, వలి, ఎస్‌బి ఎస్ఐ ప్రదీప్‌కుమార్, హోంగార్డ్ ఇన్‌ఛార్జి రామాంజనేయులు పాల్గొన్నారు.

ప్రసన్నకుమార్‌కు నియామకపత్రం అందజేస్తున్న ఎస్పీ వి.రత్న

బాల్య వివాహాలపై అవగాహన

ప్రజాశక్తి-ముదిగుబ్బ

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శనివారం బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో తహశీల్దార్ నారాయణ స్వామి, ఎంఇఒ రమణప్ప, ఎఎస్ఐలు బాబు నాయక్, లోక్‌నాథ్, టిడిపి క్లస్టర్ ఇన్‌ఛార్జి తుమ్మల మనోహర్ బాల్య వివాహం వల్ల ఎదురయ్యే దుష్పరిణామాలు, శిక్షలలను వివరించారు. మండలంలో బాల్యవివాహాలను అరికట్టాలన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల మహిళా అధ్యక్షురాలు రాధమ్మ, అంగన్వాడీ సిబ్బంది, సరితాల అబ్దుల్లా, మటన్ ఫిరోజ్, జిరాక్స్ రవి, చంద్ర పాల్గొన్నారు

తాడిమర్రి : మండలంలోని చిల్లకొండయ్యపల్లి గ్రామంలో బాల్యవివాహాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంపీడీవో రంగారావు, తహశీల్దార్ భాస్కర్‌రెడ్డి, ఎపిఒ సంజీవరెడ్డి బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలను వివరించారు. సదస్సులో ఈఒఆర్‌డి విజయశేఖర్‌నాయుడు, పంచాయతీ సెక్రటరీ ధనుంజయ, అసిస్టెంట్ ఇంజినీర్ తిరుపతయ్య, ఎఎన్ఎం రేష్మ, మహిళా పోలీస్, అంగన్వాడీ కార్యకర్తలు, సర్పంచి రామన్న, నాయకులు నాగార్జున, ఉపసర్పంచి పి.అశ్వత్థ, ఫీల్డ్ అసిస్టెంట్ రామారావు పాల్గొన్నారు.

తాడిమర్రిలో అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

బీసీ, ఈబీసీ, కాపు, కమ్మ, రెడ్డి, ఆర్యవైశ్య కార్పొరేషన్ల ద్వారా ఇస్తున్న రాయితీ రుణాల కోసం నిరుద్యోగ యువత ఫిబ్రవరి 7వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని శనివారం ఎంపీడీవో సాయి మనోహర్ ఓ ప్రకటనలో తెలిపారు. సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

5న ముస్లిముల ధర్నా

ప్రజాశక్తి-మడకశిర

వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుకు వ్యతిరేకంగా ఈ నెల 5వ తేదీ ముస్లిం ఐక్యవేదిక ఆధ్వర్యంలో విజయవాడ ధర్నా చౌక్‌లో చేపట్టనున్న ధర్నాకు ముస్లింలు పెద్దఎత్తున తరలి వెళ్లి విజయవంతం చేయాలని ఐక్యవేదిక నియోజకవర్గ అధ్యక్షులు వసీమ్ బేగ్ పిలుపునిచ్చారు. వసీమ్ బేగ్ మాట్లాడుతూ కోట్ల మంది ముస్లింలు వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకించినా, ముస్లింల అభిప్రాయాలను ఏ మాత్రం పట్టించుకోకుండా వక్ఫ్ సవరణ బిల్లును ఆమోదించడాన్ని ముస్లిం ఐక్యవేదిక తీవ్రంగా ఖండిస్తుంద న్నారు. పార్లమెంట్ సమావేశాల్లో ప్రవేశపెట్టే ఈ బిల్లుకు వ్యతిరేకంగా సిఎం చంద్రబాబు ఓటు వేసి ముస్లింలకు అండగా నిలవాలని కోరారు.

రోడ్డు నిబంధనలు పాటిస్తే ప్రయాణం సురక్షితం

ప్రజాశక్తి-ఓబుళదేవరచెరువు

రోడ్డు నియమాలు పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చని కదిరి ఆర్టీవో శ్రీనివాసరావు తెలిపారు. రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా శనివారం కదిరి ఆర్టీవో శ్రీనివాసరావు, ఎంవిఐ వరప్రసాద్, ఎస్ఐ మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులు, ఆటో డ్రైవర్లు, ద్విచక్ర వాహనదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆటో డ్రైవర్లు, వాహనదారులుతో ర్యాలీ నిర్వహించి మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేయించారు. అధికారులు మాట్లాడుతూ ఫిబ్రవరి 15వ తేదీ వరకూ రోడ్డు భద్రత మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారు నడిపేవారు సీటు బెల్టు ధరించాలన్నారు. మద్యం తాగా, సెల్ ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయకూడదన్నారు. తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఎంవిఐ రాజేష్, విజ్ఞాన్ స్కూల్స్ కరస్పాండెంట్ ఫకృద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్టీవో శ్రీనివాసరావు

వాట్సప్ గవర్నెన్స్ సేవలను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

రాష్ట్ర ప్రభుత్వం దేశంలోనే తొలిసారి వాట్సప్ గవర్నెన్స్ ద్వారా పౌర సేవలు అందిస్తుందని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ సాయిమనోహర్ తెలిపారు. వాట్సప్ సేవల కోసం 95523 00009 నెంబర్‌ను కేటాయించారని తెలిపారు. తొలి విడతగా దేవా దాయ, విద్యుత్, ఆర్టీసీ, రెవెన్యూ, అన్న క్యాంటీన్, సిఎంఆర్ఎఫ్, మున్సిపల్ శాఖల్లో 161 రకాల సేవల ను అందిస్తుందన్నారు. ఇకపై ప్రజలు సర్టిఫికెట్ల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదన్నారు. అలాగే ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమా లకు అర్హతలు, పథకాల లబ్ధి, పర్యాటక ప్రదేశాల సమాచారాన్ని తెలుసుకోవచ్చ న్నారు. టికెట్లు, వసతి సహా అన్నీ బుక్ చేసుకొనే అవకాశం ఉంటుందన్నారు. విద్యుత్ బిల్లులు, ఆస్తి పన్ను చెల్లించవచ్చ న్నారు. ట్రేడ్ లైసెన్సు పొందవచ్చన్నారు. ఆలయాల్లో దర్శనాల స్లాట్, వసతి బుకింగ్, విరాళాలు పంపవచ్చన్నారు. ఆయనతో పాటు ఏఓ అబ్దుల్ నబి, సీనియర్ అసిస్టెంట్ జె.సుబ్రహ్మణ్యం ఉన్నారు.

ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్టాపన

ప్రజాశక్తి-ముదిగుబ్బ

మండలంలోని దామానుపల్లి గ్రామ శివారులో కొండపై వెలసిన పురాతన ఆలయాన్ని పునర్నిర్మాణం చేపట్టారు. అందులో శనివారం పురోహితులు శివశంకర్ ఆధ్వర్యంలో ఆంజనేయ స్వామి విగ్రహాన్ని ప్రాణ ప్రతిష్ట చేశారు. హోమాలు, మహాకుంభాభిషేకం కార్యక్రమాలు నిర్వహించారు. శుక్రవారం రాత్రి బ్రహ్మంగారి జీవిత చరిత్ర నాటక ప్రదర్శన చేపట్టారు. భక్తులకు అన్నప్రసాదం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు సోమల ప్రకాష్‌నాయుడు, గంగులకుంట గోపాల్ రెడ్డి, పోతులయ్య, టిడిపి నాయకులు రమేష్‌బాబు, హేమేంద్రనాయుడు, వేలూరు హనుమంతు, భాస్కర్‌నాయుడు, రమణయ్య పాల్గొన్నారు.

రేపు నల్లగంగమ్మ విగ్రహ ప్రతిష్టాపన

ప్రజాశక్తి-తనకల్లు

మండలంలోని నల్లగుట్లపల్లిలో వెలసిన నల్లగంగమ్మ ఆలయంలో ఈ నెల 3వ తేదీ నల్లగంగమ్మ విగ్రహ ప్రతిష్టాపన, కుంభాభిషేకం కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరవుతారని తెలిపారు.

ఘనంగా ఓంకారేశ్వరుని ఆలయ వార్షికోత్సవం

ప్రజాశక్తి-బత్తలపల్లి

స్థానిక శ్రీలలితా త్రిపుర సుందరి సమేత ఓంకారేశ్వరుని ఆలయ ఆరో వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రధాన అర్చకులు కేశవస్వామి, వేదపండితులు బాలాజీశర్మ, ఆలయ శాశ్వత ధర్మకర్త కోటి సూర్యప్రకాష్‌బాబు, జడ్పీటీసీ సభ్యురాలు కోటి సుధ దంపతుల ఆధ్వర్యంలో శనివారం శివ పార్వతుల కళ్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. తొలుత శ్రీలలితా త్రిపుర సుందరి సమేత ఓంకా రేశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శివపార్వతుల కళ్యాణోత్సవం నిర్వహించారు. కళ్యాణోత్సవ వేడుకల్లో భాగంగా నిర్వహించిన ఎదుర్కోళ్ల ఉత్సవం భక్తులను ఆకట్టుకుంది. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కమతం లక్ష్మీనారాయణ, అంజనమ్మ, ఆకులేటి వీరనారప్ప, రాంభూపాల్‌రెడ్డి, బండి వీరనారప్ప, బ్యాళ్ల పెద్దయ్య, ఉప సర్పంచి కోటి గోపి, ద్రాక్షాయణి, తదితరులు పాల్గొన్నారు.

5న చలో విజయవాడ

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

ఎస్సీ వర్గీకరణ సాధనే లక్ష్యంగా ఈ నెల 5వ తేదీ చేపట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం ఎపి ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఒంటిమద్ది ఓబులేసు పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం పట్టణంలోని సాయిఆరామంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు రామాంజనప్ప ఆధ్వర్యంలో 'చలో విజయవాడ' కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు గోవిందప్ప, జిల్లా నాయకులు నరసింహులు, ఎంఎస్ఎఫ్ ఉమ్మడి జిల్లా కన్వీనర్ ఆదిశేషు, ఈశ్వర్, నారాయణ పాల్గొన్నారు.

పింఛన్లతో వృద్ధులకు ఆర్థిక భరోసా : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-కదిరి టౌన్

రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న పింఛన్లు వృద్ధులు, వికలాంగులు, తదితర లబ్ధిదారులకు ఆర్థిక భరోసా కలిగిస్తాయని ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ తెలిపారు. కదిరి రూరల్ మండలంలోని ముత్యాల చెరువు పంచాయతీలో శనివారం చేపట్టిన ఎన్టిఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఆయన వెంట టిడిపి మండల కన్వీనర్ చెన్నకేశవ, నాయకులు తిరుపాల్‌యాదవ్, తదితరులు ఉన్నారు.

పింఛను అందజేస్తున్న ఎమ్మెల్యే కందికుంట

ప్రతి సోమవారం 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక'

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో ప్రతి సోమవారం 'ప్రజా ఫిర్యాదుల-పరిష్కార వేదిక' కార్యక్రమం నిర్వహిస్తామని ఆర్డీవో మహేష్ తెలిపారు. అందులో డివిజన్ పరిధిలోని వివిధ శాఖల డివిజనల్ అధికారులు పాల్గొంటారని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

'ఎమ్మెల్యే గారూ ఇది తగునా'..?!

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ప్రజాస్వామ్యంలో నాలుగో అంతస్తు మీడియా రంగం. ప్రజా సమస్యలతోపాటు, ప్రభుత్వాల లోటుపాట్లను ఎత్తిచూపడమే మీడియా ప్రధాన లక్ష్యంగా ఉంటుంది. ఈ లోటుపాట్లను ఎత్తిచూపే క్రమంలో ఏదైనా లోపాలుంటే ప్రజాస్వామ్యయుతంగా నిలువరించే పద్ధతులూ ఉన్నాయి. కాని కొంత మంది నేతలు ఈ పద్ధతులు కాదని... లోపాలను ఎత్తిచూపే ప్రయత్నాలు చేసే జర్నలిస్టులను బెదిరించే ప్రయత్నాలు చేస్తుండటం సహజంగా జరుగుతుంది. ఇది సాధారణంలో అంతర్గతంగా జరుగుతూ వస్తుంటుంది. కానీ జిల్లాలో ఒక ఎమ్మెల్యే మాత్రం అందుకు తాను అతీతమని భావించడం చర్చనీయాంశమైంది. అంతర్గతంగా బెదిరిస్తే ప్రయోజనం లేదని అనుకున్నారో ఏమో... ఏకంగా మీడియా... అధికారుల ముందే బాహాటంగానే బెదిరింపులకు దిగడం దేశ వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. తనపై రాసిన వార్తల్లో వాస్తవాలు నిరూపించకపోతే రైలు పట్టాలపై పడుకోబెతానని, తనపై రాసే ముందు ఆలోచించుకోవాలని చెప్పారు. ఇంత బాహాటంగా బెదిరింపులకు పాల్పడిన వ్యక్తి అధికార పార్టీ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం. గతంలో ఈయన వైసిపిలోనున్నారు. అప్పుడు కార్మిక శాఖ మంత్రిగానూ పనిచేశారు. ఆ సమయంలోనూ ఈయనపై పెద్దఎత్తున ఆరోపణలు వెల్లువెత్తాయి. సార్వత్రిక ఎన్నికల సమయంలో టిడిపిలో చేరి గుంతకల్లు నియోజకవర్గం నుంచి పోటీచేశారు. ఈయన ఇంతలా మాట్లాడిన అధికార టిడిపి అధిష్టానం నుంచి ఎటువంటి చర్యల్లేకపోవడం శోచనీయం. 2024 సార్వత్రిక ఎన్నికల ముందు వరకు టిడిపి ప్రతిపక్షంలో ఉండగా ప్రజాస్వామ్యం, మీడియా స్వేచ్ఛ గురించి గొప్పగానే మాట్లాడింది. అయితే ఇప్పుడు మాత్రం తమ పార్టీ ఎమ్మెల్యే ఇంతలా నోరు పారేసుకున్నా చర్యలేవి లేకపోవడం గమనార్హం. గతంలో వైసిపి అధికారంలో ఉన్న సమయంలో అప్పటి వైసిపి జిల్లాలో కొంత మంది జర్నలిస్టులపై ఏకంగా భౌతిక దాడులు జరిగాయి. అప్పుడు ఇప్పటి అధికారపార్టీ దీనిపై ఆందోళనలు చేపట్టింది. ఇలా ఎవరు అధికారంలోనున్న మీడియాపై దాడులు మాత్రం కామన్‌గా మారిపోతున్నాయి. ప్రతిపక్షంలో ఉన్నప్పుడే ప్రజాస్వామ్యం గురించి మాట్లాడే నేతలు అధికారంలోకి వస్తూనే స్వరం మారుతుంది. ఈ వారంలో చోటు చేసుకున్న ప్రధానమైన అంశాలే ఇది ఉంది. ఇక జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఇందులో అత్యధిక మంది ప్రజాప్రతినిధులు సమావేశానికి దూరంగా ఉన్నారు. వచ్చిన కొద్ది మందిలోనూ విమర్శలు, ప్రతివిమర్శలతో సమావేశం మొత్తం గందరగోళంగా మారింది. అసలు ప్రజా సమస్యలేవి చర్చకు లేకుండానే ముగిసిపోయాయి.

కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి ప్రాధాన్యం : మంత్రి సవిత

ప్రజాశక్తి-పెనుకొండ

కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ లోక్‌సభలో ప్రవేశపెట్టిన ఆర్థిక బడ్జెట్‌పై రాష్ట్ర బీసీ సంక్షేమం, చేనేత, జౌళిల మంత్రి సవిత శనివారం ఓ ప్రకటనలో ప్రశంసలు కురించారు. బడ్జెట్‌లో ఏపీకి అధిక నిధులు కేటాయించినందుకు ప్రధాని నరేంద్రమోడీ, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు మంత్రి ధన్యవాదాలు తెలిపారు. విశాఖ ఉక్కు, పోలవరానికి బడ్జెట్ ఊపిరి పోసింద న్నారు. దేశ ఆర్థిక వ్యవస్థకు బలమైన పునాది వేసేలా వ్యవసాయం, పారిశ్రామిక రంగాలకు ప్రాధాన్యత ఇచ్చారన్నారు. ప్రజల కొనుగోలు శక్తిని పెంచేలా, యువతకు ఉపాధి అవకాశాలు అందించేలా కేంద్ర బడ్జెట్‌ను రూపొందించారని కొనియాడారు. క్యాన్సర్ రోగులకు ఊరట కలిగించేలా జిల్లా ఆసుప్రతుల్లో డే కేర్ క్యాన్సర్ సెంటర్లు ఏర్పాటు చేయడం, ఆరు రకాల ఔషధాలపై పన్ను మినహాయించడం అభినందనీయమన్నారు. ఏపీకి బడ్జెట్‌లో అధిక నిధుల కేటాయింపుపై సిఎం చంద్రబాబు కృషి ఎంతో ఉందన్నారు.

పేదల సంక్షేమానికి పెద్దపీట : ఎమ్మెల్యే పల్లె సింధూర



ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

పేదల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం పెద్దపీట వేసిందని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి పేర్కొన్నారు. పోలవరం, అమరావతి రాజధాని నిర్మాణానికి, విశాఖ స్టీల్ ప్లాంట్‌కు నిధులు కేటాయించడం హర్షణీయమన్నారు. ఏపీలో వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి రూ. 155 కోట్లు కేటాయించడం అభినందనీయమన్నారు. కిసాన్ క్రెడిట్ కార్డు ద్వారా రైతాంగానికి రూ. 3 నుంచి 5 లక్షల వరకూ రుణ పరిమితి పెంచడం సంతోషకరమన్నారు.

నేరాలు ఘోరాలు

ఆర్టీసీ డ్రైవర్ ఆత్మహత్య

ప్రజాశక్తి-తనకల్లు

మండలంలోని కొక్కంటి గ్రామ నివాసి తమ్మిశెట్టి సూర్యనారాయణ (50) కదిరి ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా పని చేసేవాడు. ఆయన కుటుంబంతో కలిసి కదిరి సమీపంలోని సైదాపురంలో అద్దె ఇంట్లో నివాసం ఉండేవాడు. అతడికి భార్య గాయత్రి, నలుగురు పిల్లలు ఉన్నారు. ఒక కుమార్తెకు వివాహం చేశాడు. మిగిలినవారు చదువుకుంటున్నారు. ఈ క్రమంలో కుటుంబ పోషణ భారమై సూర్యనారాయణ శుక్రవారం రాత్రి కొక్కంటి గ్రామ సమీపంలో చెట్టుకు ఉరి వేసుకున్నాడు. భార్య గాయత్రీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గోపి తెలిపారు.

ఉరి వేసుకున్న సూర్యనారాయణ

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి-ఓబుళదేవరచెరువు

స్థానిక ఐటిఐ కళాశాల సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు.. మండలంలోని ఎం.కొత్తపల్లి గ్రామానికి చెందిన వెంకటేష్ శనివారం పింఛను నగదు తీసుకుని కాలినడకన వెళ్తుండగా స్థానిక ఐటిఐ కళాశాల వద్ద మలకవారిపల్లికి చెందిన చరణ్ ద్విచక్ర వాహనంపై వేగంగా వచ్చి ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో వారిద్దరికీ తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వారి పరిస్థితి విషమంగా ఉండడంతో 108 వాహనంలో కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు.

భార్య, అత్తపై దాడి

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

భార్య, అత్తపై అల్లుడు కొడవలితో దాడి చేసి తీవ్రంగా గాయపరచిన సంఘటన శనివారం మండలంలోని బడన్నపల్లిలో చోటుచేసుకుంది. బాధితుల కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. కడప జిల్లా వేముల మండలం లోని భూమయ్యగారిపల్లికి చెందిన బ్రహ్మాచారికి, బడన్నపల్లికి చెందిన లలితకు వివాహం చేశారు. వారి మధ్య విభేదాలు రావడంతో జనవరి 28వ తేదీ వేముల పోలీస్‌స్టేషన్‌లో పంచాయితీ చేశారు. 3 నెలల తరువాత లలిత కాపురా నికి వెళ్లేటట్లు పెద్దలు మాట్లాడారు. అయితే లలిత తనతో మాట్లాడకుండా తన ఫోన్ నంబర్ బ్లాక్ చేసిందనే ఉద్దేశంతో శనివారం బ్రహ్మాచారి బడన్నపల్లికి వచ్చాడు. అతడు ఆవేశంతో భార్య లలిత, అత్త రాధమ్మపై కొడవలితో దాడి చేయడంతో వారు తీవ్రంగా గాయపడడంతో ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం అనంతపురం తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న లలిత, రాధమ్మ

మంత్రి లోకేష్‌ని కలిసిన జయప్రకాష్

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

టిడిపి రాష్ట్ర కార్యాలయంలో శనివారం ఐటిడిపి అధ్యక్షుడు కొత్తపల్లి జయప్రకాష్ మంత్రి నారా లోకేష్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. నారా లోకేష్ మాట్లాడుతూ టిడిపి చారిత్రక గెలుపులో ఐటిడిపి నాయకులు కీలక పాత్ర పోషించారని తెలిపారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత మీపై ఉందని సూచించారు. పార్టీ కోసం శ్రమించిన ప్రతి ఒక్కరికీ గుర్తింపు ఉంటుందని తెలిపారు. రాబోవు స్థానిక ఎన్నికల్లో సైతం మీ సత్తా చాటాలని తెలిపారు. పుట్టపర్తిలో సత్యసాయి బాబా మహాసమాధిని దర్శించుకోవడానికి రావాలని జయప్రకాష్ మంత్రని కోరారు.

మంత్రి లోకేష్‌ని కలిసిన జయప్రకాష్

పేదలకు కొత్త రేషన్‌కార్డులు ఇవ్వాలి

ప్రజాశక్తి-తాడిమర్రి

మండలంలోని నిరుపేదలకు వెంటనే కొత్త రేషన్‌కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం సిపిఐ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. అనంతరం తహశీల్దార్ భాస్కర్‌రెడ్డికి వినతి పత్రం ఇచ్చారు. సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి ముసుగు మధు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా అర్హత ఉన్నా రేషన్‌కార్డు లేని వారు ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరమవుతున్నారని వెంటనే నూతన రేషన్‌కార్డులు మంజూరు చేయాలని కోరారు. అలాగే పొలాలకు దారి లేక ఇబ్బంది పడుతున్న రైతులకు రెవెన్యూ అధికారులు తక్షణమే మార్గం చూపించాలని కోరారు. ధర్నాలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కమతం కాటమయ్య, వ్యవసాయ కార్మిక సంఘం గౌరవాధ్యక్షులు కుళ్లాయప్ప, మండల అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మీనారాయణ, దాసు, సన్నపెద్దన్న, సిపిఐ నాయకులు చౌడప్ప, వసూరప్ప, రాముడు పాల్గొన్నారు.

తహశీల్దార్ భాస్కర్‌రెడ్డికి వినతి పత్రం ఇస్తున్న సిపిఐ నాయకులు